సాక్షి బాపట్ల

సోమవారం । 23 । అక్టోబర్ । 2023




మల్లేశ్వరుని సేవలో ఎంపీ అయోధ్య

పెదకాకాని: భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామిని ఆదివారం రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి దర్శించుకున్నారు. స్వామికి అభిషేకం, అమ్మకు కుంకుమ పూజలు చేశారు.



అమ్మకు నృత్య నీరాజనం

తెనాలి: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి గుడిలో నృత్య గురువు చల్లా బాల త్రిపురసుందరి శిష్యబృందం నృత్యనీరాజనం సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 525.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

దుర్గాదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: అమరావతి క్షేత్రంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శ్రీబాల చాముండిక సమేత అమరేశ్వరాలయంలో ఆదివారం బాలచాముండేశ్వరి అమ్మవారిని దుర్గతులను రూపుమాపే దుర్గాదేవిగా అలంకరించారు. ఆశ్వీయుజ శుద్ధ అష్టమి ఉత్తరాషాడ నక్షత్రం దుర్గాష్టమి సందర్భంగా దుర్గాదేవిగా బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీచక్రార్చన పూజలు చేశారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో, కోదండ రామాలయంలో దుర్గాదేవి అలంకారం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దుర్గాదేవిని దర్శించి పూజలు నిర్వహించారు.

నేడు పోలీస్ 'స్పందన' రద్దు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం (ఈనెల 23న) జరగాల్సిన జగనన్నకు చెబుదాం (స్పందన) తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీఓ కార్యాలయపు అధికార వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రభుత్వ సెలవు కావడంతో రద్దు చేశామని, జిల్లా ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలను ఇచ్చే శ్రీదుర్గాదేవి దర్శనంతో భక్తులు తరించారు. శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. సర్వశక్తిమయి, దివ్యరూపిణి అయిన దుర్గమ్మకు అవని జనులు జేజేలు పలికారు. సాయంసంధ్యా సమయాన ఆలయ ప్రాంగణంలో కళాకారులు అమ్మకు నృత్యాభిషేకం చేశారు. భక్తులు క్యూలైన్లలో ఇబ్బంది పడకుండా పోలీసులు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.





కరుణించే కనకదుర్గ : నగరోత్సవంలో భక్తులను కటాక్షిస్తున్న దుర్గమ్మ (ఇన్‌సెట్) సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణి నృత్య విన్యాసం

సంభవాని యుగే యుగే

- దుర్గాదేవిగా కటాక్షించిన అమ్మ
- ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తజనం
- 1.20 లక్షల మంది సందర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదేవి శరన్నవరాత్రుల్లో ఆదివారం దుర్గాదేవి అలంకారంలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రారంభమైన రద్దీ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. మహర్నవమి, ఆదివారం కావడంతో రికార్డు స్థాయిలో 1.20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రూ.500 టికెట్ క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి నాలుగు గంటలకుపైగా సమయం పట్టింది. సీపీ టీకే రాణా ఆలయ ప్రాంగణానికి చేరుకుని వీఐపీల పేరిట వచ్చే భక్తులను నియంత్రించారు. దీంతో క్యూలైన్‌లో భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు రెండు అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మహిషాసురమర్దని దేవిగా, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 11 గంటల వరకు శ్రీ రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని సోమవారం ఉదయం 11 గంటలకు మహాపూర్ణాహుతి జరుగుతుంది.

పెరిగిన భవానీల రద్దీ

ఆదివారం నుంచి భవానీల రద్దీ పెరిగింది. తెల్లవారుజామున నగరానికి చేరుకున్న భవానీలు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం క్యూలైన్‌లో ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. అమ్మవారిని దర్శించుకుని కొండ దిగువకు చేరుకున్న భవానీలు మహా మండపం వద్ద ఇరుముడులను సమర్పించారు. సోమవారం నుంచి భవానీల రద్దీ మరింత పెరుగుతుందని ఆలయ అధికారులు, పోలీసులు అంచనా వేస్తున్నారు.

దుర్గమ్మకు విజయకీలాద్రి నుంచి సారె

చినజీయర్ ఆశ్రమం విజయకీలాద్రి నుంచి దుర్గమ్మకు సారెను అందజేశారు. త్రిదండి రామానుజ జీయర్ స్వామి అమ్మవారికి పట్టువస్త్రాలను అందజేయడానికి ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని సారెను ఆలయ అర్చకులకు అందజేశారు. పలువురు అధికారులు, న్యాయమూర్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఏపీఎస్‌పీఎఫ్ ఐజీ టి.వెంకటరామిరెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు తెప్పోత్సవం

దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శ్రీగంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లు సోమవారం కృష్ణానదిలో విహరించనున్నారు. సాయంత్రం 5 గంటలకు పవిత్ర కృష్ణానదిలో హంస వాహనంపై ఆది దంపతులు మూడుసార్లు విహరిస్తారు. భక్తులకు కనువిందు చేస్తారు.

నేటి అలంకారాలు

- శ్రీమహిషాసురమర్దనిదేవిగా.. తెల్లవారుజామున 4 గంటల నుంచి 12 గంటల వరకు
- శ్రీరాజరాజేశ్వరీదేవిగా.. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 11 గంటల వరకు





నేత్రపర్వం.. నగరోత్సవం

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల నగరోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలోని యాగశాల నుంచి ఆది దంపతుల నగరోత్సవ సేవ ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగింది. నగరోత్సవ సేవలో పలువురు భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కనకదుర్గ నగర్, రథం సెంటర్, వినాయకుడి గుడి మీదుగా నగరోత్సవం అమ్మ ఆలయానికి చేరుకుంది. అక్కడ ఆది దంపతులకు ప్రత్యేక పూజలు చేశారు.

మాతా.. కరుణిం'చండీ'



అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి చండీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మకు, స్వామికి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించి ఆలయంలోని వెంకటాద్రినాయుని మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామిని ఉంచి ఆలయ అర్చకులు కౌశిక చంద్రశేఖర శర్మ యాజ్ఞిక పర్యవేక్షణలో ఆలయ అర్చకులు విఘ్నేశ్వరపూజ, రక్షాబంధనం, పుణ్యాహవాచనం, కన్యాదానం, శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చండీ కల్యాణ విశిష్టతను వివరించారు. మహర్నవమి రోజు చండీ కల్యాణాన్ని వీక్షిస్తే బాధలు తొలగిపోతాయని చెప్పారు.

డెప్యూటీ కలెక్టర్ల బదిలీలు

గుంటూరు వెస్ట్ : రాష్ట్ర వ్యాప్తంగా 83 మంది డెప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న పలువురు అధికారులకు స్థాన చలనం కలిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈఓగా ఎన్వీబీఎస్ వసంత రాయుడు బదిలీపై పోస్టింగ్ పొందారు. ఆయన ప్రస్తుతం అమలాపురం ఆర్డీఓగా పని చేస్తున్నారు. డెప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఎ.లక్ష్మీకుమారి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎంగా, పల్నాడు జిల్లా సివిల్ సప్లైస్ డెప్యూటీ కలెక్టర్‌గా బి.గ్లోరియా, గుంటూరు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌గా బి.పెంచల ప్రభాకర్, గుంటూరు ఆర్డీఓగా పని చేసిన ఎం.ప్రభాకర్‌రెడ్డి గుంటూరు డీటీడబ్ల్యూఓగా నియమితులయ్యారు. అదే విధంగా మెప్మా పీడీగా కె.వెంకటేశ్వర్లు, గుంటూరు మైనార్టీ సంక్షేమాధికారిగా బి.నారాయణ పోస్టింగ్ పొందారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా 'కోడూరి'

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోడూరి ఏకాంబరేశ్వరబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం చీరాలలోని వాసవీ క్లాత్ మార్కెట్‌లోని చీరాల యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశారని చీరాల యూనిట్ అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీ నరసింహారావు హాజరయ్యారు. ఏకాంబరేశ్వరబాబు మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఎస్‌కే మస్తాన్, ఎస్.మస్తాన్, బాపయ్య, కృష్ణకుమారి, ఎంవీ రామారావు, శివప్రసాదరావు, శివకుమార్, మునీరుల్లాఖాన్, గుప్తా, అంజయ్య పాల్గొన్నారు.


జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఏకాంబరేశ్వరబాబు

పల్నాడులో ఫుట్‌బాల్ అభివృద్ధికి అసోసియేషన్ కృషి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అభివృద్ధికి అసోసియేషన్ కృషి చేస్తుందని పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యేశ్వర రావు చెప్పారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సమావేశం పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అభివృద్ధికి ఎక్కువగా బాల, బాలికలు, మహిళల, పురుషుల టోర్నమెంట్ నిర్వహణపై చర్చించారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్ జన్మదినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు ఫుట్‌బాళ్లను పంపిణీ చేశారు. అసిస్టెంట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఎ.శ్రీరామ్ రెడ్డి, పీడీలు ఐఎస్ నాగిరెడ్డి, ఎండీ రియాజ్, ఎస్ఎం సుభాని, ఎస్.అచ్చిరెడ్డి, ఎస్‌కే.జాన్ సైదా, నూరుల్లా, అంజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులతో సుబ్రహ్మణ్యేశ్వర రావు, పీడీలు

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్పుల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): యోగివేమారెడ్డి సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్, జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని రెడ్డి సంఘం బిల్డింగ్‌లో రెడ్డి సామాజికవర్గానికి చెందిన మెరిట్, పేద విద్యార్థులకు ఆదివారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 34 మంది విద్యార్థులకు రూ.10.50లక్షలు అందించారు. కార్యక్రమానికి హాజరైన జక్కిరెడ్డి చిన్నసుబ్బారెడ్డి, కొండారెడ్డిలను సేవా సమితి తరపున సన్మానించారు. అనంతరం సేవా సమితి అధ్యక్షుడు ఆరె శివారెడ్డి మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేసి త్వరలో రెడ్డి సంఘం భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కన్వీనర్ మాలపాటి భాస్కరరెడ్డి, డాక్టర్ చిన్నపరెడ్డి, డాక్టర్ ఇన్నారెడ్డి, పెద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వై.రామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, నూజెండ్ల ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నూజెండ్ల మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, కొండలురెడ్డి, జక్కిరెడ్డి బ్రహ్మారెడ్డి, కె.ఎరుకులరెడ్డి, లేళ్ల అంజిరెడ్డి, కె.కృష్ణారెడ్డి, ప్రముఖ న్యాయవాది చెన్నకేశవరెడ్డి, మణిపాల్ హాస్పిటల్ సీఎఫ్ఓ జక్కిరెడ్డి రామాంజనేయరెడ్డి, మూలె వెంకటేశ్వరరెడ్డి, ఎం.ఎల్.రెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, యోగిరెడ్డి, టి.రామకృష్ణారెడ్డి, మాలపాటి కోటిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


స్కాలర్ షిప్‌లను అందజేసిన ట్రస్ట్ సభ్యులు

టూరిస్ట్ బస్సు, లారీ ఢీ

- వ్యక్తికి తీవ్రగాయాలు
- శబరిమల నుంచి వస్తున్న ప్రయాణికులు

మార్టూరు: శబరిమల నుంచి అయ్యప్ప భక్తులతో వస్తున్న టూరిస్ట్ బస్సును లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన మార్టూరు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం ఇసుకపల్లి గ్రామానికి చెందిన 22 మంది అయ్యప్ప భక్తులు శబరిమల వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రహదారిపై వెళ్తున్న వీరి బస్సును అదేమార్గంలో వెనుక నుంచి వెళ్తున్న ఓ లారీ బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సులోని ఆర్.అప్పలరాజు అనే వ్యక్తికి కుడికాలు విరగడంతో స్థానికులు అతనిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ప్రమాదమేమి జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


ప్రమాదంలో గాయపడిన అప్పలరాజు

శంకరన్ జీవితం నేటి అధికారులకు స్ఫూర్తిదాయకం

చీరాల రూరల్: ఐఏఎస్ అధికారిగా, మానవతావాదిగా చరిత్రలో నిలిచిన శంకరన్ జీవితం నేటి తరం అధికారులకు, సామాజిక న్యాయం కోసం కట్టుబడి ఉన్న వారందరికి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. దివంగత మాజీ ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ జయంతి వేడుకలను ఆదివారం విజయనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దుడ్డు భాస్కరరావు, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు, బీఎస్పీ జిల్లా నాయకుడు సిర్రా భగత్‌సింగ్‌లు మాట్లాడారు. దేశ చరిత్రలో మరువలేని మానని గాయమైన కారంచేడు మారణహోమం.. ఆ ఘటన తరువాత బాధితుల తరఫున ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ ఎన్నో న్యాయ పోరాటాలు చేసి పునరావాసంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. శంకరన్ ఉమ్మడి రాష్ట్ర సాంఘిక సంక్షేమ కార్యదర్శిగా నెల్లూరు, కర్నూలు జిల్లాల కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి దళిత, ఆదివాసీల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. 120కి పైగా జీఓలు జారీచేసిన ఘనత ఆయన సొంతమన్నారు. హరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖను సాంఘిక సంక్షేమ శాఖగా మార్పటానికి సంబంధించిన జీఓ వాటిలో ఒకటిగా ఉందంటే ఆయన చేసిన కృషిని శ్లాఘించాల్సిందేనన్నారు. శంకరన్ జీవితమంతా నిజాయితీగా గడపడమే కాదు ఆయన కోసం సొంతగా ఇల్లు కూడా నిర్మించుకోకుండా ప్రజా జీవితానికి పాటుపడ్డారని చెప్పారు. 1976లో వెట్టిచాకిరీ నిషేధ చట్టం ఆయన చేసిందేనన్నారు. 2005లో పద్మ భూషణ్ అవార్డును ఎంతో సున్నితంగా తిరస్కరించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు.

పాకీ పనివారి విముక్తి కోసం దేశవ్యాప్త ఉద్యమం..

అదే విధంగా దళిత మానవ హక్కుల కార్యకర్త బెజవాడ విల్సన్‌తో కలసి సఫాయి కర్మచారి ఆందోళన్ అనే సంస్థను స్థాపించి పాకీ పనివారి విముక్తి కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించి ప్రభుత్వం వారి సంక్షేమం మీద దృష్టిసారించేలా చేశారని తెలిపారు. ఆ ఉద్యమం వలన ఎంతోమంది చేతితో మానవ మలం ఎత్తే అమానవీయ విధుల నుంచి విముక్తి పొందారని వారు పేర్కొన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఎస్ఆర్ శంకరన్ జీవితం ఎంతో నిరాడంబరంగా సాగిందని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం ఉద్యోగులు పనిచేయాలని వారు పేర్కొన్నారు. బుడుంగుంట్ల లక్ష్మీ నరసయ్య, గొర్రెపాటి రవికుమార్, తేళ్ల అబ్రహం, దుడ్డు జోసఫ్, నెహెమ్యా, తేళ్ల లక్ష్మయ్య, సులోచన, తేళ్ల సైమన్, దుడ్డు వెంకటయ్య, మాణిక్యరావు, మున్నంగి జోసఫ్‌లు పాల్గొన్నారు.


శంకరన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా ఖాదర్‌బీ



బల్లికురవ: జిల్లా భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా షేక్ ఖాదర్‌బీని నియమించారు. మండలంలోని వైదన గ్రామానికి చెందిన ఖాదర్‌బీ బీజేపీలో చురుకైన కార్యకర్తగా పనిచేయడంవల్ల రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ ఖాదర్‌బీకి ఆదివారం నియామకపత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఖాదర్‌బీ తెలిపారు.

3న స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ సర్వే

బాపట్ల అర్బన్: నవంబరు 3వ తేదీన నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ సర్వే(ఎస్ఈఏఎస్) సంబంధించి బాపట్ల పట్టణంలో చేపట్టిన మండల స్థాయి కో–ఆర్డినేటర్ల శిక్షణ ఆదివారంతో ముగిసిందని డీఈఓ రామారావు తెలిపారు. బాపట్ల జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఎంపిక చేసిన 994 పాఠశాలలలోని 3, 6, 9 తరగతులకు చెందిన 23,924 విద్యార్థులకు అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. దీనికి సంబంధించి ఎంఈఓలు మండల కో–ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారని, వీరికి శిక్షణ పూర్తయిందని వెల్లడించారు. మూడో తరగతి విద్యార్థులకు 40 మార్కులకుగాను 60 నిమిషాలు, ఆరో తరగతి విద్యార్థులకు 50 మార్కులకుగాను 75 నిమిషాలు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 60 మార్కులకు 90 నిమిషాలపాటు పరీక్షకు సమయం ఉంటుందని తెలిపారు. పరీక్షకు సంబంధించి డీఈడీ, బీఈడీ, పీజీ, డిగ్రీ విద్యార్థులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మార్టూరు: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన విషయమై పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఈఘటన మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ కె.కమలాకర్ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామానికి చెందిన కానాల కోటేశ్వరరావు, వెంకట సుబ్బమ్మ దంపతుల కుమార్తె నాగలక్ష్మి (29) మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన తాతా బ్రహ్మయ్యతో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈక్రమంలో శనివారం ఉదయం తమ ఇంట్లో నాగలక్ష్మి మంచంపై నుంచి కింద పడి మరణించిన స్థితిలో చూసిన బంధువులు ఆమె తల్లి వెంకట సుబ్బమ్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అదేరోజు రాత్రి సీఐ ఫిరోజ్, ఎస్ఐ నాగరాజుపల్లి వెళ్లి నాగలక్ష్మి మృతిపై స్థానికులను విచారించారు. తమ కుమార్తె మృతిపై అనుమానం ఉన్నట్లు ఆదివారం ఉదయం తల్లి వెంకట సుబ్బమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నాగలక్ష్మి మృతదేహానికి మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఇంకొల్లు (చినగంజాం): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఓ మహిళ మృతి చెందిన ఘటన ఇంకొల్లు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ వివరాల మేరకు.. తేళ్ల చెంచులక్ష్మి (55) భర్త వెంకటేశ్వర్లు శనివారం రాత్రి తమ కుమార్తె పిల్లలను వెంట తీసుకొని గుంటూరు హాస్పిటల్ నుంచి కారులో తిరిగి వస్తున్నారు. ఇంకొల్లు మార్కెట్ యార్డు దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా ట్రావెల్స్ బస్సు, పక్కరోడ్డులో నుంచి ఆటోలు దూసుకొచ్చాయి. కారు నడుపుతున్న వెంకట సుబ్బారావుకు రోడ్డు సరిగా కనబడకపోవడంతో అదుపుతప్పి కుడివైపున డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో చెంచులక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నరసరావుపేట: జిల్లాలోని శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల ఖాళీల భర్తీని నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని సమగ్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ(ఐసీడీఎస్) పీడీ బి.అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు 13 కాగా, ఆయా పోస్టులు 74 ఖాళీలు ఉన్నాయన్నారు. డివిజన్ వారీగా ఖాళీలు.. నరసరావుపేట డివిజన్‌లో మూడు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, 41 సహాయకుల పోస్టులు, గురజాల డివిజన్‌లో ఆరు కార్యకర్తల పోస్టులు, సహాయకుల పోస్టులు 13, సత్తెనపల్లి డివిజన్‌లో నాలుగు కార్యకర్తల పోస్టులు, ఆయా పోస్టులు 20 ఉన్నాయన్నారు. అర్హులైన వారు అక్టోబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సమీపంలోని గ్రామ సచివాలయాలు, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.